సాక్షి
కర్నూలు

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఉంచి సహస్రనామ పూజలు చేపట్టారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శుక్రవారం విజయవాడకు చెందిన లక్ష్మీసుధాకర్ రూ.2.02.232 విరాళాన్ని ఆలయ ఏఓ హిమబిందుకు అందించారు.



ఉసూరుమని'పించన్'

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్త పింఛన్ల కోసం అర్హులు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అనర్హత పేరుతో తొలగింపుల పర్వం పూర్తి అయ్యే వరకు కొత్త పింఛన్లు ఇచ్చే అవకాశం లేదు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: జిల్లా నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం ఉదయం 11 గంటలకు డీపీఓలోని చాంబర్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఏపీలో ఇటీవల 27 మంది ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం కలిగింది. ఇందులో భాగంగా ఇక్కడున్న బిందు మాధవ్ కాకినాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి విక్రాంత్ పాటిల్ ప్రస్తుతం కాకినాడ నుంచి బదిలీపై జిల్లాకు వస్తున్నారు.

క్లస్టర్ యూనివర్సిటీ కాన్వొకేషన్ వాయిదా

కర్నూలు (సిటీ): ఫిబ్రవరి 8న జరగాల్సిన క్లస్టర్ యూనివర్సిటీ కాన్వొకేషన్ వాయిదా వేయమని గవర్నర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయని ఉప కులపతి ఆచార్య డీవీఆర్ సాయి గోపాల్ తెలిపారు. కాన్వకేషన్ ఎప్పుడు నిర్వహించేది గవర్నర్ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత తెలియజేస్తామన్నారు. కాన్వొకేషన్‌కి దరఖాస్తు చేసిన యూజీ, పీజీ విద్యార్థులకు తదుపరి తేదీని ఈ-మెయిల్, ఫోన్‌ల ద్వారా ముందుగానే సమాచారమిస్తామని వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.


అనాథ బాలలను చేరదీయండి



వీధి బాలలను గుర్తించేందుకు బయలుదేరుతున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): అనాథ బాలలను చేరదీసి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలులోని కొత్తబస్టాండ్, రాజ్‌విహార్, రైల్వే స్టేషన్, చిల్డ్రన్స్‌పార్కు, భూపాల్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో వీధి బాలలను గుర్తించేందుకు అధికారులు బృందాలుగా ఏర్పడి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా వీధి బాలలు కనిపిస్తే 15100, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసేలా ప్రజలకు అవగా హన కల్పించాలన్నారు. కార్యక్రమంలో లేబర్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మీ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శివరామచంద్ర రావు, మహిళా పోలీసు ఎస్‌ఐ రమణరావు, సీడబ్ల్యూసీ మెంబర్ వెంకటరాముడు పాల్గొన్నారు.

మార్చిలోగా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తాం



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఈ ఉమాపతి

కోసిగి: జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు మార్చి నెలాఖరులోగా పూర్తి స్థాయిలో అందజేస్తామని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లాలోని ఎమ్మిగనూరు, బనవాసి, పెద్దకడబూరు, వందగల్లు, కోసిగి, కౌతాళం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయా సబ్ స్టేషన్‌ల్లో ఓల్టేజీ సమస్యలను, వివిధ రకాల సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం 7,500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అందులో కోసిగి మండలంలో 220 వరకు ఉంటాయన్నారు. సీనియార్టీ ప్రకారం గత ఏడాది ఆగస్ట్ వరకు అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి నెల 100 శాతం విద్యుత్ బిల్లులు వసూళ్లు అవుతున్నాయని, వలస వెళ్లిన ప్రాంతాల్లో బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని, వాటిని విద్యుత్ సిబ్బంది ఫోన్ చేసి వసూళ్లు చేసేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆయన వెంట కోసిగి ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ ఉన్నారు.

11 మందితో కమిటీ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్‌కు 11 మందితో నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జీ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా పి.ఉరుకుందయ్య శెట్టి నియమితులయ్యారు. సభ్యులుగా బి.నరసప్ప, మహబూబ్ బాషా, రవికుమార్, బీమేష్, వి.రాజు, వెంకటేశ్వరరెడ్డి, సలామ్, నరసింహులు, నవీన్‌కుమార్, వెంకటగిరి ఉన్నారు. ఈ కమిటీ ఆరు నెలల పాటు కొనసాగుతుంది. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ జీవో జారీ చేశారు.

ప్రజలపై బాదుడే బాదుడు!



ప్రజలతో కిక్కిరిసిన కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై మరింత భారం మోపుతోంది. డిసెంబర్, జనవరి నెలల్లో రూ.17 వేల కోట్ల విద్యుత్ ట్రూఅప్ చార్జీలను వేసింది. ఫిబ్రవరి నుంచి స్థిర, చరాస్తుల విలువలను పెంచి ప్రజల నడ్డి విరిచేందుకు సిద్ధమైంది. భూముల విలువ 20 నుంచి 45 శాతం వరకు పెంచినట్లు చెబుతున్నా వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. కొన్నిచోట్ల నూరు శాతం, మరికొన్ని చోట్ల 50 శాతానికిపైగా పెరిగింది. ఎన్నికల ముందు ప్రజలకు చెప్పిన దానికి విరుద్ధంగా సీఎం చంద్రబాబు నాయుడు భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచడంపై అంతటా నిరసన వ్యక్తమవుతోంది.

- నేటి నుంచి పెరిగిన చార్జీలతో భూముల రిజిస్ట్రేషన్లు
- గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతానికి పైగానే భూముల విలువ పెంపు
- కర్నూలు నగరం, పట్టణాల్లో నూరుశాతం పెరుగుదల
- జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కన ఉండే స్థలాలపై 50 శాతానికి పైగా పెంపు
- పొలాల విలువను 20 శాతానికిపైగా పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో మొత్తం 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలోని భూములు, ఇండ్లు, స్థలాలు, ఇతర ఆస్తుల విలువను ప్రభుత్వం అమాంతం పెంచింది. భవన నిర్మాణ రంగం కుదేలై ఉన్న సమయంలో మళ్లీ ఆస్తుల విలువను పెంచడంతో మదుపరులు గగ్గోలు పెడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు లబోదిబోమంటున్నారు. మరోవైపు ప్రభుత్వంపైకి మాత్రం స్థిర, చరాస్తుల విలువను 10 నుంచి 45 శాతం వరకు పెంచినట్లు అధికారికంగా చెబుతోంది. అయితే అందుకు భిన్నంగా రేట్లను పెంచారు. కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్, ఆదోని, ఎమ్మిగనూరు మునిసిపాలిటీల్లో దాదాపు 80 నుంచి 100 శాతం వరకు భవన నిర్మాణ రేట్లను పెంచారు.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ముఖ్యమైన పట్టణాలు, మండల కేంద్రాల పరిధిలో 50 శాతం వరకు రేట్లు పెరిగాయి. అలాగే జాతీయ, రాష్ట్ర రహదారుల సమీపంలో ఉన్న పొలాలు, భవన నిర్మాణ స్థలాల రేట్లు కూడా భారీగా పెరిగాయి. దాదాపు 50 - 60 శాతం వరకు పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో పొలాల విలువను 10 శాతం వరకు, ఇళ్ల స్థలాల విలువను 20 శాతం వరకు పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం వాస్తవానికి మొదట 15 శాతం రేట్లను మాత్రమే పెంచి జనవరి 1 నుంచి అమలు చేయాలని ఆదేశించింది. అయితే అధిక ఆదాయం కోసం మరోసారి రేట్లను పరిశీలన చేసి దాదాపు 45 శాతం వరకు అన్ని రకాల ఆస్తుల విలువను పెంచేలా ఆదేశాలు ఇచ్చింది.

వినియోగదారులపై భారం ఎలా పడుతుందంటే..


కల్లూరు మండలం లక్ష్మీపురంలో ఇప్పటి వరకు చదరపు గజం ఇంటి విలువ రూ.2,500 ఉంది. దానిని ప్రస్తుతం రూ.5వేలకు పెంచారు. అంటే దాదాపు 50 శాతం పెరిగింది. గజం విలువ రూ.2,500 ప్రకారం 2.75 సెంట్ల స్థలాన్ని వినియోగదారుడు కొనుగోలు చేస్తే దాని మొత్తం విలువ రూ.3,32,500కు రిజిస్ట్రేషన్, సర్‌చార్జీ, యూజర్ చార్జీల కింద 7.5 శాతం చెల్లించాలి. పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీల ప్రకారం అదే 2.75 సెంట్ల స్థలాన్ని అదే వినియోగదారుడు ఇప్పుడు కొనుగోలుచేయాలంటే ఫీజు కింద 49,875 చెల్లించాలి.

➡ కర్నూలులోని గాంధీనగర్‌లో ఇప్పటి వరకు గజం విలువ రూ.30 వేలు ఉంది. ప్రస్తుతం దాని గజం విలువ రూ.75 వేలకు చేరింది. ఇప్పుడు ఇక్కడ ఓ వినియోగదారుడు 2.75 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేయాలంటే రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనప్పుడు మొత్తం విలువ 39,90,000కు రిజిస్ట్రేషన్ ఫీజు కింద 7.5 శాతం ప్రకారం చెల్లించారు. రిజిస్ట్రేషన్ విలువ పెరిగిన తరువాత అదే 2.75 సెంట్లస్థలాన్ని దాని మొత్తం విలువ 99,75,000లకు గాను ఫీజు కింద 7.5 శాతం ప్రకారం అంటే రూ.7,48,125 చెల్లించాలి. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతుండటంతో వారం రోజులుగా క్రయ, విక్రయాలు జోరందుకున్నాయి.

పెరిగిన విలువలతో రిజిస్ట్రేషన్

జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వారం రోజులుగా క్రయ, విక్రయదారులతో కిటకిటలాడాయి. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన విలువల ఆధారంగా రిజిస్ట్రేషన్ చార్జీలు వసూలు చేస్తుండటంతో ఎక్కువ మంది కార్యాలయాలకు వచ్చి రిజిస్ట్రేషన్ పనులను పెట్టుకున్నారు. అయితే స్థిర, చరాస్తుల విలువల మదింపు కారణంగా ఆన్‌లైన్ సక్రమంగా రాక వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కాగా.. పెరిగిన విలువలతో శనివారం నుంచి రిజిస్ట్రేషన్లు చేయనున్నారు.


నిర్మాణ రంగం కుదేలే..



రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచితే నిర్మాణ రంగం కుదేలవుతుంది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా దెబ్బతినడంతో ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. ఈ సమయంలో స్థిర, చరాస్తుల విలువను పెంచడం అనాలోచిత నిర్ణయం. వ్యవసాయ రంగం తర్వాత రియల్ ఎస్టేట్ రంగమే అతి పెద్దది. దానిని ఆదుకోవడం కోసం పెంచిన రిజిస్ట్రేషన్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

– బ్రిజేష్ సింగ్, బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కర్నూలు

రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు తగదు



ఇప్పటికే రిజిస్ట్రేషన్ చార్జీలు చాలా ఎక్కువగా ఉన్నాయి. రెండు, మూడు సెంట్ల స్థలం రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు రూ.40 వేలకు చేరుకుంటుంది. పట్టణాల్లో రూ.60 వేల నుంచి రూ.70 వేల మధ్య ఉంటుంది. ఈ సమయంలో రేట్లను పెంచితే ఆ విలువలు మరింత ఎక్కువై ప్రజలపై భారం పడే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను తక్షణమే ఉప సంహరించుకోవాలి. లేదంటే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కానుంది.

– రజనీకాంత్ రెడ్డి, రియల్ ఎస్టేట్ వ్యాపారి, కర్నూలు

పెంచిన విలువల ఆధారంగానే రిజిస్ట్రేషన్లు

జిల్లాలో శనివారం నుంచి పెరిగిన విలువల ఆధారంగానే రిజిస్ట్రేషన్లు చేస్తారు. క్రయ, విక్రయదారులు సహకరించాలని కోరుతున్నాం. సరాసరిగా 20 నుంచి 45 శాతం వరకు విలువలు పెరిగాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలలు మదింపు చేసి ప్రజలకు భారం లేకుండా విలువలు పెంచాం. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం.

-ఎం. చెన్నకేశవరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు

సమన్వయంతో బాల్య వివాహాలు అరికట్టాలి

- మహిళా, శిశు, వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్యకుమారి



కిషోరి బాలికస్వేచ్ఛ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహిళా అభివృద్ధి, శిశు శాఖ సెక్రటరీ సూర్యకుమారి, డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి బాల్య వివాహాలను అరికట్టాలని మహిళా, శిశు, వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సెక్రటరీ సూర్యకుమారి అన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై గ్రామీణ ప్రజల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, తహసీల్దార్లు, మండల విద్యాధికారులు, వైద్యారోగ్యశాఖ, పోలీసు అధికారులతో బాల్య వివాహాలను అరికట్టేందుకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో కలసి ఆమె సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేస్తే పోక్సో కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఆడ పిల్లలను తప్పనిసరిగా చదివించాలన్నారు. రాష్ట్రంలో ఆరు నెలలుగా 746 బాల్య వివాహాలను అడ్డుకున్నామన్నారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో ఈ ఏడాది 64 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు తెలిపారు. కర్ణాటక సరిహద్దులోని ఆదోని, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, మంత్రాలయం, సీ బెళగల్‌లను హైరిస్క్ మండలాలుగా గుర్తించామని, ఆయా మండలాల్లో 17, 18, 19 ఏళ్ల వయస్సు ఉన్న వారికే ఎక్కువగా వివాహాలు జరుగుతున్నాయన్నారు. వారిలో మధ్యలో బడి మానేసిన అమ్మాయిలు కూడా ఉన్నట్లు తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్వే ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 37 శాతం బాల్య వివాహాలు జరుగుతు న్నాయన్నారు. కొన్నేళ్లుగా బాల్య వివాహాల అనర్థాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నా ఫలితం లేకుండా పోతుందన్నారు. అనంతరం కిషోరి బాలిక స్వేచ్ఛకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, అడిషినల్ ఎస్పీ హుస్సేన్‌పీరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ రోహిణి, యూనిసెఫ్ డైరెక్టర్‌మురళీకృష్ణ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన పెరగాలి

కర్నూలు (హాస్పిటల్): సైబర్ నేరాల పట్ల యువతీయువకులు అవగాహన పెంచుకోవాలని సెట్కూరు సీఈఓ పి.దీప్తి అన్నారు. శుక్రవారం స్థానిక సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం-సైబర్ నేరాలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూరు సీఈఓ మాట్లాడుతూ బాలికలు, మహిళలు తమ ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయకూడదన్నారు. మహిళల ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా, మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ బహుమతులు, స్పెషల్ ఆఫర్లు అంటూ మొబైల్ ద్వారా వచ్చే ఎలాంటి లింకులను క్లిక్ చేయవద్దన్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి లింకుల ద్వారా మొత్తం సమాచారాన్ని సేకరించి వేధించడం ఎక్కువగా జరుగుతోందన్నారు. మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలపై 181, 1098, 1930, 100 మొదలైన టోల్‌ఫ్రీ నెంబర్లకు సంప్రదిస్తే చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయసూరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణులు శ్రావణి, విజయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

5న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు



ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు

- ఎనిమిది నెలల కూటమి పాలనలో విద్యా వ్యవస్థ తిరోగమనం
- ఫీజు బకాయిల పెండింగ్‌తో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- కళాశాలల యాజమాన్యాలు వేధిస్తున్నా కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్ షిప్‌లు, పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5వ తేదీన 'వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు' పేరుతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.3,900 కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకు దూరం కాకుడదని ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ఆర్ ఫీజు రీయింబర్స్ మెంటు పథకాన్ని తీసుకువచ్చి ఉన్నత చదువులకు బాటలు వేశారన్నారు. చదువుకు భరోసా ఇవ్వడంతో ఎంతో మంది ఇంజినీర్లు, డాక్టర్లు అయ్యారన్నారు. అదే స్ఫూర్తితో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఐదేళ్ల పాటు ప్రతి త్రైమాసికం విద్యార్థుల ఫీజును కళాశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రుల ఖాతాలో వేశారని గుర్తు చేశారు. జగనన్న పాలనలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గత విద్యా సంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో రూ.12,609 కోట్లు, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు రూ.18 వేల కోట్లు చెల్లించారన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం పేదలు, సామాన్యులు, మధ్య తరగతి పిల్లలు భవిష్యత్‌తో చెలగాటమాడుతుందని విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. ఇంగ్లిషు మీడియం, 3వ తరగతి నుంచే టోఫెల్ సబ్జెక్టు టీచర్లను రద్దు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సీబీఎస్ఈ నుంచి ఐబీ దాక ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్లు మూలకు పడేశారన్నారు. వసతి దీవెన, విద్యాదీవెన లేక విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు కళాశాలల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని వేధిస్తున్నా కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదన్నారు. పరీక్షల హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. షాడో ముఖ్యమంత్రిగా మారిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విద్యార్థుల సమస్యలు కనిపించకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న కూటమి ప్రభుత్వం పేదల చదువులు, ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని విమర్శించారు. ఫీజు బకాయిలు చెల్లించకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఫీజు పోరును విజయవంతం చేయండి

ఫిబ్రవరి 5వ తేదీన వైఎస్సార్‌సీపీ చేపట్టే ఫీజు పోరు నిరసన కార్యక్రమానికి విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు, విద్యార్థి సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రాజ్ విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, విద్యార్థి సంఘం నాయకులు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు కొలనుభారతిలో 'వసంత పంచమి'

కొత్తపల్లి: కొలనుభారతి క్షేత్రంలో ఆదివారం వసంత పంచమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి ఆదేశించారు. క్షేత్రంలో వాహనాలు నిలుపు స్థలం, క్యూలైన్ల ఏర్పాట్లు, ఛారుఘోషిని నది కొలను వద్ద ఏర్పాట్లను శుక్రవారం ఆర్డీఓ పరిశీలించారు. మహిళల కోసం వ్యక్తిగత మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రానికి ఉన్న రహదారిలో గుంతలు, పిచ్చిమొక్కలు, ముళ్లకంపలను తొలగించాలన్నారు. తహసీల్దార్ ఉమారాణి, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్ పాల్గొన్నారు.



కొలనును పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

కుంభాభిషేకానికి నేడు అంకురార్పణ



కలశాలను ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం: ప్రసిద్ధ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో తొలి కుంభాభిషేక మహోత్సవానికి శనివారం అంకురార్పణ జరగనుంది. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు నేతృత్వంలో మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నారు. రాజగోపురాలపై కలశాల ప్రతిష్ఠ, గణపతి, లక్ష్మీదేవి, నవగ్రహాల ప్రతిష్ఠాపన చేయనున్నారు. తూర్పు ప్రధాన రాజగోపురం ముంగిట గణపతి, లక్ష్మీదేవి మంటపాలు సిద్ధం చేశారు. అలాగే ఆలయ ఈశాన్య భాగంలో నవగ్రహాల మంటపం నెలకొల్పారు. ఉత్సవాల నేపథ్యంలో రాజగోపురాలు, మహాప్రాకారం, వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం అభిముఖంగా పచ్చని తోరణాలతో యాగమంటపాన్ని ఏర్పాటు చేశారు. వీఐపీలు కొలువు దీరేందుకు ఆ పక్కనే ప్రత్యేక వేదిక రూపొందించారు. కలశ ప్రతిష్ఠను భక్తులు వీక్షించేందుకు ఆలయ చుట్టూ రూ.50 లక్షలతో పందిళ్లు నెలకొల్పారు. భక్తుల సౌకర్యార్థం దాత సాయంతో ప్రత్యేక షెడ్లు వేయించారు. ఇప్పటికే భక్తులకు సరిపడిన లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశారు. రాజగోపురాలపై క్రతువులు గావించేందుకు ప్రతి గోపురం పైకి చేరుకునేందుకు ప్రత్యేక మెట్ల సముదాయాన్ని నెలకొల్పారు. కలశాలను శుక్రవారం ఆదోని పట్టణంలో ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు.



రాజ గోపురం పైకి చేరుకునేందుకు కర్రలతో మెట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

మల్లన్న హుండీ ఆదాయం రూ.2.59 కోట్లు



కానుకలు లెక్కిస్తున్న దేవస్థాన అధికారులు, సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలోని ఉభయ దేవాలయాలలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూపేణా రూ.2,59,68,400 లభించినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం దేవస్థాన చంద్రావతి కల్యాణ మండపంలో హుండీల లెక్కింపులు చేపట్టారు. గత 22 రోజుల్లో భక్తులు ఈ కానుకలు సమర్పించారు. నగదుతో పాటు బంగారం 64.200 గ్రాములు, వెండి 3.170 కిలోలు లభించినట్లు ఈఓ తెలిపారు. అలాగే యూఎస్ఏ డాలర్లు 590, చైనా యువాన్స్ 100, సౌదీ అరేబియా రియాల్స్ 5, కువైట్ దినార్స్ 2, కెనడా డాలర్లు 10, యూఏఈ దిర్హమ్స్ 1090, సింగపూర్ డాలర్లు 14, ఖత్తార్ రియాల్స్ 1, యూరోస్ 5, మలేషియా రింగిట్స్ 23, యూకే పౌండ్స్ 45 మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీలలో లభించాయి.

క్లుప్తంగా

కొనసాగుతున్న సెపక్‌తక్రా పోటీలు


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీజీ కళాశాలలో శుక్రవారం మూడో రోజున సెపక్‌తక్రా పోటీలు కొనసాగాయి. మణిపూర్, బిహార్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాలురు, మణిపూర్, హర్యానా, బిహార్, కేరళకు చెందిన బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. నంద్యాలలో సెపక్‌తక్రా జూనియర్స్ నేషనల్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని రామకృష్ణారెడ్డి అన్నారు. క్రీడా భారతి సభ్యుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

కర్నూలు సిటీ: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై పోస్టు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ కోర్సు ట్రెనింగ్ పూర్తి చేసిన అధ్యాపకులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఢిల్లీలో ఏఐసీటీఈ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. దేశ వ్యాప్తంగా 21 ప్రముఖ విద్యా సంస్థలకు చెందిన అధ్యాపకులు ఈ శిక్షణకు ఎంపికకాగా, తెలుగు రాష్ట్రాల నుంచి కర్నూలు ట్రిపుల్‌ఐటీడీఎం మాత్రమే సర్టిఫికెట్ కోర్సుకు ఎంపికై ంది. ఈ విద్యా సంస్థలోని ఈసీఈ,సీఎస్ఈ, ఎంఈ విభాగాల నుంచి 15 మంది నిపుణులు 26 మల్టీడిసిప్లీనరీ ప్రాజెక్టులలో పాల్గొన్నారు. రెండు ఇంక్యుబేట్‌లు, 2 పేటెంట్స్, 5 కాన్ఫరెన్స్‌లు, జర్నల్ పబ్లికేషన్‌ల పరంగా మంచి ఫలితాలు సాధించారు. ట్రెనింగ్‌లో రాణించిన 48 మందికి ఏఐసీటీఈ చైర్మన్ ఆచార్య టీజీ సీతారం సర్టిఫికెట్లు అందజేశారు. దేశంలో ప్రస్తుతం పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలను విద్యార్థులకు అందించాలని ఆయన సూచించినట్లు ట్రిపుల్‌ఐటీడీఎం అధ్యాపకులు తెలిపారు.

ప్రాణం తీసిన విద్యుత్ తీగలు


బోయ రంగస్వామి (ఫైల్)

గోనెగండ్ల: పాత ట్రాన్స్‌ఫార్మర్ తీసి కొత్తది ఏర్పాటు చేసి తీగలు లాగుతుండగా విద్యుత్ షాక్‌కు గురై గోనెగండ్లకు చెందిన బోయ రంగస్వామి(45) అనే వ్యక్తి మృతిచెందాడు. ఈ దుర్ఘటన కులుమాల గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. గోనెగండ్ల కిందిగేరికి చెందిన బోయ రంగస్వామికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కులుమాల గ్రామంలో ఆర్డీఎస్ విద్యుత్ మరమ్మతులు జరుగుతుండటంతో రంగస్వామి వెళ్లాడు. పాత ట్రాన్స్‌ఫార్మర్ తీసి కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు లాగుతుండగా షాక్‌కు గురయ్యాడు. తోటి కూలీలు రంగస్వామిని చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

ఉసూరుమని 'పింఛన్'

- ఈ ఏడాది ఆగస్టు వరకు కొత్త పింఛన్లు లేనట్టే!
- నేడు ఫిబ్రవరి నెల పింఛన్ల పంపిణీ


లబ్ధిదారులను పరీక్షిస్తున్న వైద్యులు

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్తపింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేతకార్మికులు, మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు. అయితే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు ఇవ్వడంపై ఎలాంటి ఆసక్తి చూపడం లేదు. పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయి అనర్హత పేరుతో తొలగింపుల పర్వం పూర్తి అయ్యే వరకు కొత్త పింఛన్లకు అవకాశం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు ఇచ్చేవారు. అర్హత కలిగిన వారందరికీ రాజకీయాలకు అతీతంగా పింఛన్లు మంజూరయ్యేవి. కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు ఇవ్వకుండా ఉసూరుమనిపిస్తోంది. వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్న పలువురు 2024 జనవరిలో మృతిచెందారు. లబ్ధిదారు భార్యకు మరుసటి నెలలోనే వితంతు పింఛన్ ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేలాది మంది వితంతు మహిళలు పింఛన్లకు దూరం అయ్యారు.

ఇదీ దుస్థితి..

☛ నెలల క్రితమే భర్తలు మృతి చెందినా నంద్యాల మండలంలోని అయ్యలూరు గ్రామంలో లక్ష్మి, అప్పయ్యమ్మ, రమణమ్మలకు వితంతు పింఛన్ రాలేదు.

☛ పోలూరు, మిట్నాల, పెద్దకొట్టాల తదితర గ్రామాల్లో వృద్ధులు, వితంతువులకు నేటికీ పింఛనకు నోచుకోలేదు. అర్హత ఉన్న దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ వందలాది మంది ప్రదక్షిణలు చేస్తున్నారు.

☛ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాలకు అర్హులు వెళ్తున్నా వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని చెప్పి వెనక్కి పంపిస్తున్నారు.

రచ్చబండల వద్ద పింఛన్ల పంపిణీ?

ఇంటి దగ్గర పింఛన్ల పంపిణీ అంటూ కూటమి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు చెప్పిన మాటలు అమలు కావడం లేదు. ప్రతి నెలా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి దగ్గరే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొంటున్నా.. అది నోటిమాటలకే పరిమితం అవుతోంది. గత ఏడాది జూన్ నుంచి 2025 జనవరి నెల వరకు ఒక్క సచివాలయం పరిధిలో కూడా 100 శాతం పింఛన్లు ఇంటి దగ్గరే పంపిణీ చేయలేదు. రచ్చబండలు, సచివాలయాల్లో పంపిణీ చేశారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,54,924 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.194 కోట్లు మంజూరు అయ్యాయి. కర్నూలు జిల్లాలో 2,39,332, నంద్యాల జిల్లాలో 2,15,592 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీకి నిధులు విడుదల అయ్యాయి. ఫిబ్రవరి నెలలో కూడా ఇంటి దగ్గరే పంపిణీ అనేది నామమాత్రానికే పరిమితం కానుంది.

పింఛన్ల తొలగింపు కుట్ర!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 56,518 మంది దివ్యాంగులకు పింఛన్ వస్తోంది. ప్రతి పింఛన్‌ను రీ వెరిఫికేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వారంలో మంగళ, బుధ, గురు వారాల్లో పింఛన్లను వెరిఫికేషన్ చేపట్టింది. ఫిబ్రవరి నెలలో కూడా వారంలో మూడు రోజుల పాటు పింఛన్ వె రిఫికేషన్ కోసం అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దివ్యాంగులకు కర్నూలు, ఆదోని, నంద్యాలలో పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వితంతు, ఒంటరి మహిళలు, వృద్ధాప్య పింఛన్లులు కూడ పరిశీలించే కార్యక్రమం చేపడుతారు. ఈ నేపథ్యంలో పాత పింఛన్లను తొలగించే కుట్ర చేస్తున్నారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. తొలగింపుల తర్వాతనే కొత్త పింఛన్లకు అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

కర్నూలు(సెంట్రల్): గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని మహిళా, శిశు అభివృద్ధి, వికలాంగులు, వృద్ధుల శాఖల సెక్రటరీ ఏ.సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆమె కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖడైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డితో కలసి ఐసీడీఎస్ ప్రాజెక్టులపై సూపర్‌వైజర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వారిలో రక్తహీనతను నివారించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు అంగన్‌వాడీలపై నిత్యం సూపర్‌వైజర్లు, సీడీపీఓలు పర్యవేక్షణ చేయాలన్నారు. కాగా, చిన్న పిల్లల మెదడు 1000 రోజుల్లో అభివృద్ధి చెందుతుందని,ఆలోపు పౌష్టికాహారాన్ని అందిస్తే తల్లి, పిల్లలుఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం మండలాల వారీగా అంగన్‌వాడీల్లోని సదుపాయాలు, కల్పిస్తున్న సేవలపై సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, ఐసీడీఎస్‌పీడీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతికి విరివిగా రుణాలు

- ఎంఎస్‌ఎంఈ కింద రూ.150 మందికి రూ.6.75 కోట్ల రుణాల పంపిణీ
- ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ నవీన్‌కుమార్ వెల్లడి


రూ.6.75 కోట్ల రుణాలను పంపిణీ చేస్తున్న ఏపీజీబీ రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్):ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రైతులు, స్వయం సహాయక సంఘాలు, ఇతర అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి అవసరమైన రుణాలు ఇస్తుందని రీజినల్ మేనేజర్ పీఎస్ నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఏపీజీబీ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ శాఖ ప్రాంగణంలో రుణ విస్తరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా 150 మంది ఖాతాదారులకు ఎంఎస్‌ఎంఈ కింద రూ.6.75 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ... ఏపీజీబీ జిల్లాలో 61 శాఖలతో అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందిస్తోందని తెలిపారు. రూ.5,596 కోట్లతో అధిర వ్యాపార వాటాను కలిగి ఉందని పేర్కొన్నారు. రైతులకు పంట రుణాలతో పాటు టర్మ్‌లోన్‌లు, ఇతరత్రా అనేక రుణ సదుపాయం కల్పిస్తున్నామని, స్వయం సహాయ సంఘాలు కూడా వివిధ వ్యాపా రాల్లో రాణించేందుకు వీలుగా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ రుణాలే కాకుండా గృహ, వాహన, వ్యక్తిగత, విద్య రుణాలతో పాటు ఆస్తి తనఖా రుణాలు అతి తక్కువ వడ్డీకే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు ప్రత్యేక రాయితీలు ఉన్నాయని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లాలో మూడు సరళ రుణ కేంద్రాలు ప్రారంభించి అతి తక్కువ, స్థిర వడ్డీరేటుతో రుణాలు ఇస్తున్నామని తెలిపారు. అక్టోబరు నుంచి ఇప్పటి వరకు రూ.24 కోట్ల రిటైల్ రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. రుణ విస్తరణ కార్యక్రమాన్ని అన్ని బ్రాంచీలో నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రీజినల్ కార్యాలయం అధికారులు, కర్నూలు నగరంలోని వివిధ బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

ఓమ్ని హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ అధికారుల విచారణ


ఓమ్ని హాస్పిటల్‌లో విచారణ చేస్తున్న ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు ఓమ్ని హాస్పిటల్‌లో శుక్రవారం ఎన్‌టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ) జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ భాస్కరరెడ్డి విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో వైద్యసేవ పథకం కింద చికిత్స పొందుతున్న రోగులను కలిసి వివరాలు సేకరించారు. చికిత్స కోసం ఎవ్వరైనా డబ్బులు ఇచ్చారా అని వాకబు చేశారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని గురువారం చికిత్స పొందుతూ మృతి చెందిన దేవనకొండ మండలం బండగట్టు గ్రామానికి చెందిన కురువ ఆదిలక్ష్మికి అందించిన వైద్యసేవల గురించి వైద్యులను, ఆసుపత్రి యాజమాన్యం వద్ద నుంచి వివరాలు సేకరించారు. ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. వివరాలను లిఖిత పూర్వకంగా తనకు పంపించాలని కోరారు. కాగా ఓమ్ని హాస్పిటల్‌లో జరిగిన మరణాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. శాంతికళకు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న వినతి పత్రం సమర్పించారు.

మల్లన్న సేవలో సినీనటి మీనాక్షిచౌదరి, గోల్డ్‌మ్యాన్ విజయ్


పాతాళగంగ బోట్‌లో నటి మీనాక్షి చౌదరి


గోల్డ్‌మ్యాన్ కొండ విజయ్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి, గోల్డ్‌మ్యాన్ కొండ విజయ్ శుక్రవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఇటీవల విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నటించిన మీనాక్షిచౌదరి శ్రీశైలం చేరుకుని మల్లన్నకు రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం రోప్‌వేలో పాతాళగంగకు చేరుకుని బోటింగ్‌లో షికారు చేశారు. హీరోయిన్ మీనాక్షిచౌదరిని చూసిన పలువురు భక్తులు ఆమెతో సెల్ఫీలు దిగారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన గోల్డ్‌మ్యాన్ కొండ విజయ్ శ్రీశైల మల్లన్నను దర్శించుకున్నారు. సుమారు 5 కేజీల బంగారు అభరణాలు ధరించి కొండ విజయ్ స్వామిఅమ్మవార్ల దర్శనానికి వచ్చారు. గోల్డ్‌మ్యాన్‌ను చూసేందుకు పలువురు భక్తులు పోటీపడ్డారు.

వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె ఎర్రబద్దెల వీధిలో శుక్రవారం దూదేకుల హుశేని(46) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేర కు.. మృతుడు హుశేని భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తుంటాడు. మద్యానికి అలవాటు పడి తరచూ ఇంట్లో గొ డవ పడుతుండేవాడు. ఈక్రమంలోనే జమాత్ కోసం 45 రోజుల పాటు ఢిల్లీ లో ఉండి రెండు రోజుల క్రితం తిరిగి అంకిరెడ్డిపల్లెకు వచ్చాడు. మళ్లీ ఇంటికి ఎందుకు వచ్చావని కుటుంబ సభ్యు లు ప్రశ్నించడంతో మద్యం మానుకొ ని బాగున్నానని వారితో వాదించాడు. భార్య దస్తగిరిమ్మ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలానికి చేరుకొని మృతికి గల కార ణాలపై ఆరాతీశారు. కుటుంబ సభ్యు ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంతాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

'బాదుడు' భరించలేక..

కూటమి ప్రభుత్వం బాదుడుకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అదనపు భారం మోయలేమంటున్నారు. తాజాగా సర్కారు పెంచిన స్థిర, చరాస్తులు విలువలు నేటి నుంచి అమల్లోకి రానుండటంతో ముందుగానే రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు క్యూ కట్టారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు కార్యాలయాలు కిటకిటలాడాయి. మధ్య మధ్యలో సర్వర్ డౌన్, బీజీ రావడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. –సాక్షి ఫొటో గ్రాఫర్, కర్నూలు


క్రయవిక్రయదారులతో కిటకిటలాడుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయం


కౌంటర్ల వద్ద గుమికూడిన రిజిస్ట్రేషన్‌దారులు


సబ్ రిజిస్ట్రార్ దగ్గర ఇలా..


రిజిస్ట్రేషన్ కార్యాలయం బయట బారులుతీరిన వాహనాలు

ఫిల్టర్ పైపుల ధ్వంసం


వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీ కాంతరెడ్డి పొలంలో పైపులను ధ్వంసం చేసిన దుండగులు

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచు ఎర్రగుడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ లక్ష్మీకాంత రెడ్డి పొలంలో బుధవారం రాత్రి ఫిల్టర్ పైపులతోపాటు మోటర్ పైపులను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. గత ఐదు రోజుల క్రితం కూడా ఇతని ఇంటి మీదకు అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి వెళ్లగా ఆ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంతలోనే పొలంలోని పైపులు గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఆలస్యంగా గుర్తించిన లక్ష్మీకాంతరెడ్డి కావాలనే కొందరు తనపై దాడులకు ఉసిగొల్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఈ దాడులకు పాల్పడుతున్న వారిని పోలీసులు గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దౌలత్‌ఖాన్ మృతి బాధాకరం

- నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి


దౌలత్‌ఖాన్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(అర్బన్): ఇంటి పన్ను మినహాయింపునకు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ గుండెపోటుతో మాజీ జవాన్ దౌలత్‌ఖాన్ మృతి చెందడం బాధాకరమని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మృతుని కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం వచ్చేలా తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో ఇటీవల గ్యాస్ పేలిన దుర్ఘటనలో పేలిపోయిన ఇంటిని శుక్రవారం నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. దుర్ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడి నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న లింగమయ్య, సుబ్బరాయుడు కుటుంబాలకు సంబంధించిన బాధితులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ జవాన్ దౌలత్‌ఖాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పీపీ మధుసూదన్‌రెడ్డి, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు దాల్ మిల్ అమీర్, పురుషోత్తంరెడ్డి, గోవిందరెడ్డి, శివారెడ్డి, శివనాగిరెడ్డి, సుబ్బన్న, మల్లేశ్వరరెడ్డి, జాకీర్ హుసేన్, 6వ వార్డు కౌన్సిలర్ పురందర్‌కుమార్, సోమశేఖర్‌రెడ్డి, కలాంబాషా, సమ్మద్, జలీల్, దౌలత్‌ఖాన్ పోరాట కమిటీ సభ్యులు సోహేల్‌రాజా, మహబూబ్‌బాషా, ఖాజాహుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని ఇద్దరికి గాయాలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సాయి బాబా గుడి సమీపంలో ఎమ్మిగనూరుకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం రాత్రి కోసిగి నుంచి ఉరుకుంద గ్రామానికి బస్సు వెళ్తుంది. దుద్ది గ్రామానికి చెందిన భీమయ్య, తిమ్మప్ప అనే వ్యక్తులు అతిగా మద్యం తాగి బైక్ పై వస్తున్నారు. సాయిబాబా గుడి సమీపంలో బస్సును ఢీకొని కిందపడిపోయారు. గాయాలు కావడంతో వారిని కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను అక్కడి వైద్యులు ఆదోని ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.



స్వామికే శఠగోపం

- పావన క్షేత్రంలో దేవస్థాన సిబ్బంది దోపిడీ పర్వం
- స్వామి వెండి, బంగారు కానుకలు, హుండీ సొమ్ము తో పాటు తలనీలాలు తస్కరిస్తున్న వైనం
- తాజాగా దేవుడు శిక్షిస్తారని దేవస్థాన జనరల్ మేనేజర్ చేసిన పోస్ట్ వైరల్
- తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటారా? లేక అధికారపార్టీకి తలొగ్గి వదిలేస్తారా?
- చర్చించుకుంటున్న భక్తులు, దేవస్థాన సిబ్బంది

ఆళ్లగడ్డ: అహోబిలం క్షేత్రం పరిధిలోని నవ నారసింహ ఆలయాలకు ఎంతో ప్రశస్తి ఉంది. వీటిలో స్వయంభువుగా వెలసిన పావన నృసింహస్వామి ఆలయం వద్దనే భక్తులు ఎక్కువ శాతం మొక్కుబడులు చెల్లించుకుంటారు. క్షేత్రంలోని 9 దేవాలయల పరిధిలో ఎంత ఆదాయం వస్తుందో ఒక్క ఈ పావన ఆలయంలో అంత వస్తుంది. అలాంటి ఆదాయం తెచ్చి పెట్టే పావన క్షేత్రంలో కొందరు సిబ్బంది దేవస్థాన నిర్వాహకుల పర్యవేక్షణ లోపం, అలసత్వాన్ని ఆసరా చేసుకుని చెలరేగి పోతున్నారు. అదును చూసి నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. ఇటీవల చోటు చేసుకుంటున్న వరుస సంఘటనలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా దేవస్థానంలో అత్యున్నత పదవిలో ఉన్న జనరల్ మేనేజర్ పావన క్షేత్రంలో ప్రతి నెల రూ. 60 వేలు విలువైన తలనీలాలు అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది దోపిడీ చేస్తున్నారని దేవుడు మిమ్మలను శిక్షిస్తారని దేవస్థాన వాట్సాప్ గ్రూపులో మెసేజ్ పెట్టి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆధారాలుంటే చర్యలు తీసుకునేందుకు భయమెందుకు ?

పావన క్షేత్రంలో విధులు నిర్వహించే సిబ్బంది అక్రమాలు చేస్తున్నారు వారిని దేవుడు శిక్షిస్తారని మేనేజర్ పోస్టు పెట్టడంపై పలు విమర్శలు వస్తున్నాయి. అనుమానం వస్తే నిఘా ఉంచాలి. ఆధారాలుంటే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి అంతే కాని ఇలా బహిరంగంగా పోస్టు పెట్టి ఎవరిపైనా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం ఏంటని చర్చించుకుంటున్నారు. అసలు ఎన్ని నెలల నుంచి అక్కడ దోపిడీ జరుగుతోంది. ఇంత వరకు ఎంత మేర ఆదాయం కోల్పోవలసి వచ్చింది అన్న విషయాలు చర్చించకుండా మెసెజ్ పెట్టడంపై సిబ్బంది, భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందిని బెదిరించి దారిలోకి తెచ్చుకునేందుకు ఇలా చేశారా ? లేక అన్ని ఆధారాలు ఉన్నా అధికార పార్టీ నేతకు భయపడి చర్యలు తీసుకోలేకపోతున్నారా ? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

గోవిందా ..ఇదేమైనా బాగుందా!

ఓ ఇరవై రోజుల క్రితం ఇదే దేవస్థానంలో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బంది మధ్యాహ్నం గుడి మూతేసిన సమయంలో ఎవరో డిన్నర్‌కు పిలిచారు. దేవాలయానికి దూరంగా అడవిలోకి వెళ్లి వారు అక్కడ మద్యం సేవించి, మాంసం తిన్నారని ఫిర్యాదు వచ్చింది. వీరంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉద్యోగంలో చేరారన్న సమాచారంతో మేనేజర్ ఆఘమేఘల మీద ఎక్కడో ఢిల్లీలో ఉన్న ఇక్కడున్న మనియార్‌కు ఆర్డర్ వేయడం ఆయన వెళ్లి డ్యూటీలో ఉన్న వారిని పరీక్షించడం, అప్పటికప్పుడు రిపోర్ట్ తయారు చేసి పంపడం వెనువెంటనే సస్పెండ్ చేయడం చకచక జరిగిపోయింది. అనంతరం ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆదేశాలు సైతం జారీ చేశారు. చిరుద్యోగులు భయంతో అహోబిలం మఠం పీఠాధిపతి పాదాలపై పడి తప్పైపోయిందని వేడుకోవడంతో ఆయన ఇక మీదట ఇలాంటి తప్పులు చేయకండి అని మందలించి డ్యూటీలో జాయిన్ కండి అని చెప్పారు. పీఠాధిపతి చెప్పి పంపినా ఇంతవరకు వారిని మేనేజర్ డ్యూటీలోకి తీసుకోలేదు. దేవాలయానికి దూరంగా వెళ్లి తినడమే అంత పెద్ద నేరమైతే డ్యూటీలో ఉండి రూ. లక్షలు దోచుకుంటూ క్షేత్ర ఆదాయానికి గండి కొడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేమని చేతులెత్తేయడం ఏంటని సిబ్బంది, భక్తులు ప్రశ్నిస్తున్నారు.



పావన క్షేత్రం(ఇన్‌సెట్‌లో) జనరల్ మేనేజర్ పెట్టిన పోస్ట్